
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.4 కనిష్ఠం 24.6



పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి రూరల్, జూన్ 15: ధైర్య సాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి తదితర అంశాల్లో ప్రతిభ కనబర్చిన బాలబాలికలు-2024 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను, భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ప్రదానం చేయనున్నారు. ఈ సంవత్సరం కూడా అవార్డుల కోసం అవార్డ్స్.జీఓవి.ఇన్‌లో జూలై 31 తేదీలోగా 18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళ, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమాధికారి బావయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇష్టారాజ్యంగా.. నిర్మాణాలు!



- పట్టణాల్లో అడ్డగోలుగా కొనసాగుతున్న భవన నిర్మాణాలు
- మున్సిపల్ చట్టాన్ని సైతం లెక్కచేయని వైనం
- నిబంధనలు పాటించకుండా అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు
- కనీసం వాహనాల పార్కింగ్‌కు స్థలాలు వదలని పరిస్థితి
- కామారెడ్డి పట్టణంలో 24కు పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు
- బాన్సువాడ, ఎల్లారెడ్డిల్లోనూ ఇదే పరిస్థితి
- అపార్ట్‌మెంట్ నిర్మాణంలో నిబంధనలు పాటించని బిల్డర్లు
- అక్రమ నిర్మాణాలకు నేతల అండదండలు
- ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న బల్దియా అధికారులు

కామారెడ్డి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఆయా పట్టణాల్లో కొత్తకొత్త కాలనీలు వెలుస్తుండడం, మున్సిపాలిటీ అంతకు అంతగా విస్తరిస్తుండడంతో భవన నిర్మాణాల సంఖ్య పెరుగుతోంది. అపార్ట్‌మెంట్‌ల కల్చర్ సైతం చాలానే వచ్చింది. అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు ఆదేశిస్తున్నా కాగితాలకే పరిమితమవుతున్నాయి. కానీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో మున్సిపల్ చట్టం అమలు కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇటు పాలకవర్గాలు దృష్టి సారించకపోవడం అటు అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణలు కొనసాగుతున్నాయి. మూడు మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్నా పలుచోట్ల దరఖాస్తులను బల్దియా అధికారులు తిరస్కరించినప్పటికీ ఆ నిర్మాణాలు కొనసాగుతునే ఉన్నాయి. స్థానిక నేతల అండదండలతో అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆయా మున్సిపాలిటీలకు రావాల్సిన ఆదాయం సమకూరడం లేదు.

కామారెడ్డిలో 24కు పైగా అక్రమ భారీ భవంతుల నిర్మాణాలు

జిల్లా కేంద్రమైన కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కామారెడ్డి పట్టణం జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి కొత్తకొత్త కాలనీలు వెలుస్తుండడంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. అదేస్థాయిలో నిర్మాణాలు ఎక్కువవుతునే ఉన్నాయి. అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు సైతం పెరుగుతున్నాయి. పట్టణ శివారులోనే కాకుండా నడీబొడ్డున గల ప్రధాన రహదారుల వెంట భారీగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఈ భారీ అంతస్తుల నిర్మాణాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కనీస నిబంధనలు పాటించకపోవడం, మున్సిపల్ చట్టం ప్రకారం నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ భారీ అంతస్తుల్లో ప్లాట్‌లను, వాణిజ్య సముదాయాలను కొనుగోలు చేసిన బాధితులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కామారెడ్డి పట్టణంలో సుమారు 24కు పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల పట్టణంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లోనూ రాజకీయం చోటు చేసుకుంది.

కాగితాలకే పరిమితమవుతున్న నిబంధనలు

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ విధానం అమలవుతునే ఉంది. ఆయా పట్టణాల్లో ఎవరైన నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతి కోసం మీ సేవలోని టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణాల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన కొత్త మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం 120 గజాల స్థలం ఉన్నవారు ఇళ్లు కట్టుకోవాలంటే 1.5 మీటర్ల సెట్‌బ్యాక్ వదలిపెట్టాలి. రోడ్డు 30 అడుగులు ఉంటే ఇరువైపుల 5 అడుగుల చొప్పున స్థలాన్ని మున్సిపాలిటీకి అటాచ్ చేయాలి. ప్రధాన రహదారి అయితే ఈ సెట్‌బ్యాక్ మూడు మీటర్లు ఉండాలి. ఈ నిబంధనలు అన్ని కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్‌లు ఏర్పాటు చేస్తూ అందులో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్ల అంచు వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా బల్దియాలో పార్కింగ్ స్థలాలు కనిపించడం లేదు. హోటల్‌లు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలు, పాఠశాలలు, కళాశాలల నిర్మాణాలు అయితే నూతన చట్టం ప్రకారం 25శాతం స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు ఎక్కడ కూడా అమలు కావడం లేదు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నా జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో జీప్లస్ 2, జీప్లస్ 3, జీప్లస్ 4 అనుమతి తీసుకుని నిర్మించుకుంటున్న ఇళ్ల మీద నీళ్ల ట్యాంకుల నిర్మాణం పేరుతో అదనపు స్లాబ్‌లు వేస్తున్నారు. వాస్తవానికి ట్యాంక్ నిర్మిస్తే దాని కింద ఇంటి నిర్మాణం ఉండకూడదు. ఉంటే అదనపు గదిగా పరిగణిస్తారు. దీంతో దాన్ని అక్రమ కట్టడం కింద లెక్క కడతారు. ఇలా అనుమతి ఒకలా తీసుకుంటూ నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. ఇక చాలా మంది ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అపార్ట్‌మెంట్, వాణిజ్య, వ్యాపార సముదాయాల నిర్మాణాలు చాలా మట్టుకు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది.

అక్రమ నిర్మాణాలకు నేతల అండదండలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో సాధారణ కొత్త ఇళ్ల నిర్మాణంతో పాటు భారీ అంతస్తుల భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీల నుంచి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. కానీ కొందరు ఇళ్ల యజమానులు, బిల్డర్‌లు, వ్యాపారవేత్తలు మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా వార్డుల్లో అక్రమ నిర్మాణాలు జరగడానికి నేతల అండదండలు ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా కనీసం నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలకు చెందిన డ్రైనేజీ, రోడ్లను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. కానీ స్థానిక నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనుకడుగు వేస్తుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

అక్రమ లే అవుట్లు, భూ కబ్జాలపై..
రాష్ట్ర విజిలెన్స్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు!

- కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2004 నుంచి జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని వినతి
- కామారెడ్డి ఎమ్మెల్యే ఫిర్యాదుతో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి గమ్మునున్న అధికారుల్లో భయం భయం

కామారెడ్డి టౌన్, జూన్ 15: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్‌లు, భూ కబ్జాలపై రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌కు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఫిర్యాదు చేశారు. వివిధ లేఅవుట్ ప్లాన్‌లను పరిశీలించాలని, 2004 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన లే అవుట్‌లు, ప్రైవేట్ స్థలాలను ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను, ఓపెన్ స్థలాల్లో నిర్మాణం చేపట్టిన నిర్మాణాలపై విచారణ జరపాలని కోరారు. ఓ లే అవుట్‌లో 13 ఎకరాల 30 గుంటలకు గాను అందులో రూ.20కోట్ల విలువ గల 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని అధికార వర్గాలు అందించిన వివరాల్లో ఉందని తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని జన్మభూమి రోడ్డులో ఉన్న 80 అడుగుల రోడ్డును 20 అడుగులు ఆక్రమించారని, ప్రస్తుతం ఆ రోడ్డు 60 అడుగులు మాత్రమే ఉందని తెలిపారు. మిగిలిన 20 అడుగులను రాజకీయ నాయకుల సహకారంతో కంపౌండ్ వాల్స్, ఇతర నిర్మాణాలు చేపట్టారని, పాత బస్టాండ్ స్థలం ఆర్‌అండ్‌బీ శాఖకు చెందినది కాగా 40 శాతం భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలు చేపట్టారని, కామారెడ్డి మున్సిపల్, పక్కనే ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నీటి పారుదల శాఖ భూములు, నాలాలు అక్రమంగా ఆక్రమణలకు గురయ్యాయని దీంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని, చెరువులు, కుంటల్లోకి నీరు అనేది వెళ్లకుండా ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం వెనుక గల జయ శంకర్ కాలనీలో 150 కోట్ల విలువైన 25 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించారని తెలిపారు. మొత్తంగా రూ.300 నుంచి 400 కోట్ల భూములను అన్యాక్రాంతం కాబడ్డాయని తెలిపారు. అంతేకాకుండా పట్టణంలోని గాంధీగంజ్ పక్కన గల సర్వే నెంబర్ 6 వద్ద 2 ఎకరాల విస్తీర్ణంలో ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారని కొన్ని నిర్మాణాలు జరిగాయని దీని విలువ సుమారు రూ.30కోట్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో దాదాపు 480 లే అవుట్‌లు ఆమోదం పొందాయని అయితే వీటిలో 200 కంటే ఎక్కువ లే అవుట్‌లు చాలా వరకు బహిరంగ ప్రదేశాలను ఆక్రమించుకుని వ్యక్తిగత భవనాలు, వివిధ కమ్యూనిటీ హాల్‌లు, వివిధ మతపరమైన నిర్మాణాలు, కొందరు రాజకీయ నాయకులు నిర్మించారని తెలిపారు. పార్కింగ్ స్థలాలకు, వినోద కార్యక్రమాలకు స్థలాలు లేవని అన్నారు. కామారెడ్డి మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి జీవనోపాధి కోసం అక్కడే ఉంటున్నారని ఈ తరుణంలో కొందరు వ్యక్తులు లైసెన్స్ పొందిన ఇంజనీర్ల మద్దతుతో నకిలీ కాగితాలు సృష్టించి పత్రాలు తయారు చేస్తున్నారని తెలిపారు. రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఇతర అధికారుల సహకారంతో ఇతరుల భూమిని బదిలీ చేయడానికి సహకరిస్తున్నారని తెలిపారు. అయితే ఎమ్మెల్యే ఫిర్యాదుతో గత 20 సంవత్సరాలుగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి గమ్మునున్న పలువురు అధికారులు, అక్రమార్కుల్లో భయం నెలకొందని తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్యేగా లేకముందే పలు అక్రమాలపై ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు మున్సిపల్‌లోని ఆయా విభాగాల అధికారుల పనితీరుపై విచారణ జరపడంతో పాటు క్షేత్రస్థాయిలో పలు అవినీతి, అక్రమాలను గుర్తించారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగా ఉండడంతో విచారణ జరిగితే ఏ అధికారికి ఏ తిప్పలు వస్తాయోనని భయపడుతున్నట్లు సమాచారం.

కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బదిలీ

- జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ నియామకం
- నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఆశిష్ సంగ్వాన్
- నిర్మల్ నుంచి బదిలీపై రానున్న కొత్త కలెక్టర్
- జితేష్ వి.పాటిల్ భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ



నూతన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జితేష్ వి.పాటిల్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ఆయా జిల్లా కలెక్టర్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ జాబితాలో కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సైతం స్థాన చలనం కల్పించారు. జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఆశిష్ సంగ్వాన్ 2023 అక్టోబరులో నిర్మల్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని ప్రాంతం. ఈయన అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. అనంతరం 2015లో జరిగిన సివిల్ సర్వీస్ పరీక్షల్లో 15వ ర్యాంక్ సాధించారు. సంగ్వాన్ భార్య 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కాంత్రివల్లూర్. ఈమె ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరికి ఒక పాప ఉంది. సంగ్వాన్ ఆదివారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న జితేష్ వి.పాటిల్ 2021 సెప్టెంబరు 1న బాధ్యతలు స్వీకరించారు. జి తే ష్ వి.పాటిల్ జిల్లాలో దాదాపు మూడేళ్ల పాటు కలెక్టర్‌గా పని చేశారు. జిల్లాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేస్తు సుమారు 3 ఏళ్ల పాటు పాలన కొనసాగిస్తూ వచ్చారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రతిపక్షాల నుంచి కలెక్టర్ కాస్త విమర్శలు ఎదుర్కొన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా కలెక్టర్ పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్, బీజేపీలు ఆరోపించాయి. అయితే ఒకానొక సమయంలో కలెక్టర్ తీరుకు నిరసనగా బీజేపీ నేత వెంకట రమణారెడ్డి నిరాహార దీక్ష సైతం చేపట్టారు. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల విషయంలో ఎన్ఓసీ జారీ చేసి విలువైన భూములను కొందరు రియల్ వ్యాపారులకు కట్టబెట్టారని బీజేపీ నేతలు ఆరోపించారు. అదేవిధంగా కామారెడ్డి మాస్టర్ ప్లాన్ వివాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారులు వైఫల్యం అయ్యారని రైతులు ఉద్యమబాట పట్టిన విషయం తెలిసిందే. ఈ సమయంలోను కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు రైతుల నుంచి విమర్శలు తప్పలేదు. ఇలా పాటిల్ జిల్లాలో దాదాపు మూడు సంవత్సరాల పాటు పాలన కొనసాగించారు. శనివారం పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.

కడతేరనున్న ధరణి కష్టాలు

- భూ సమస్యలపై సర్కారు దృష్టి
- రైతుల హర్షం

మద్నూర్, జూన్ 15: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ ఆదేశించడంతో తమ భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో చేపట్టిన రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా చాలా వరకు భూముల సమస్యలు ఏర్పడ్డాయి. పాస్ బుక్‌లు రాకపోవడంతో, మిస్సింగ్ సర్వే నెంబర్లు, నిషేధిత భూములు జాబితాలో చేర్చడం, ఇలా ఎన్నో సమస్యలు ఏర్పడ్డాయి. గతంలో ధరణిని తహసీల్దార్లు, ఆర్డీవో స్థాయిలో ఏమి చేయలేని పరిస్థితి ఉండేది. ఏదైనా దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అన్ని సమస్యలకు సంబంధించిన మాడ్యూల్స్‌ను ప్రభుత్వం ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఇచ్చింది.

వారసత్వంపై సందిగ్ధత

వారసత్వ భూములను కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అమ్ముకునే వీలు గతంలో లేదు. ధరణి వచ్చాక ఎవరి పేరు మీద ఉంటే వారు అమ్ముకునే స్వేచ్ఛ అమలులోకి వచ్చింది. దీంతో రికార్డుల్లోకి ఎక్కని రైతులకు మార్గం మూసుకుపోయింది. అసైన్ చట్టం ప్రకారం అసైనీలు చనిపోతే ఆ భూములను వారసుల పేర్ల మీద మార్చాలి. కానీ అది జరగడం లేదు. డిజిటల్ సంతకం కాని పాస్ పుస్తకాలు జారీ కాని భూములపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

భూమి కోసం దారుణం



మృతి చెందిన దుర్గయ్య

- ఎకరం భూమి ఇవ్వాలంటూ భర్తపై దాడికి పాల్పడ్డ భార్య, కొడుకు , మామ
- తీవ్ర గాయాలతో మృతి

ఎల్లారెడ్డి, జూన్ 15 : జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. తనకు ఇవ్వాల్సిన భూమి ఇవ్వడం లేదంటూ భర్తపై భార్యతో పాటు కొడుకు, మామ కలిసి మూకుమ్మడిగా దాడికి పాల్పడగా.. తీవ్ర గాయాలతో అతను చనిపోయాడు. విషాదం నింపిన ఘటన వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని ఎల్లారెడ్డి మండలం సాతెల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య (35) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన లక్ష్మిని 15 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి పదమూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలం వరకు సాఫీగా సాగిన వీరి సంసారంలో.. ఆ తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయి. ఇద్దరి మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో రావడంతో.. గత పదేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారు. అయితే దూరంగా ఉంటున్నందుకు ఒక ఎకరం పొలం ఇవ్వాలని లక్ష్మి తన భర్త దుర్గయ్యను ఇటీవల కోరగా.. ఇందుకు అతను ససేమిరా అన్నాడు. తనకు విడాకులు ఇచ్చిన తర్వాతే భూమి ఇచ్చే విషయం గురించి ఆలోచిస్తానని చెప్పాడు. అంత వరకు ఎట్టి పరిస్థితుల్లో భూమిని ఇచ్చేది లేదని తేల్చి చెప్పాడు. దీంతో భర్తపై లక్ష్మి కోపంతో రగిలిపోయింది. ఈ క్రమంలో శనివారం కుర్మ దుర్గయ్య పొలం వద్ద ఉండడంతో.. గమనించిన భార్య లక్ష్మి, కొడుకు, మామ భూమి విషయమై దుర్గయ్యతో గొడవకు దిగారు. అతను ప్రతిఘటించడంతో.. ముగ్గురూ కలిసి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో దుర్గయ్యకు తీవ్ర గాయాలు కావడంతో.. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే దుర్గయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్న ఆశయ్య ఫిర్యాదు మేరకు దుర్గయ్య భార్య లక్ష్మి, కొడుకు, మామపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ధర్నా

- 3 నెలల క్రితం డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం లేదు
- కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి సబ్‌స్టేషన్ వద్ద రైతుల నిరసన

కామారెడ్డి టౌన్, జూన్ 15: మూడు నెలల క్రితం డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు రోడ్డెక్కారు. జిల్లాలోని చిన్నమల్లారెడ్డి గ్రామం వద్ద గల సబ్‌స్టేషన్ వద్ద తిమ్మక్‌పల్లికి చెందిన సుమారు 60 మంది రైతులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి నెలలో బోర్ల వద్ద మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు డీడీలు చెల్లించామని తెలిపారు. అప్పటి నుంచి ఏ విద్యుత్ అధికారిని సంప్రదించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం వానాకాలం పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా బోర్లకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఇప్పటి వరకు పచ్చిరొట్ట విత్తనాలు సైతం అలకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను బిగించాలని కాంట్రాక్టర్‌ను కోరినా బిగించనని దబాయిస్తున్నాడని రైతులు ఆరోపించారు. ఏఈని ఫోన్‌లో సంప్రదించినా స్పందించడం లేదని పేర్కొన్నారు. జిల్లా విద్యుత్ శాఖాధికారులు అయిన దృష్టి సారించి మా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాగా గంట సేపు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి రైతులు వెళ్లిపోయారు.



చిన్నమల్లారెడ్డి సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

17 నుంచి ఉచిత యోగా శిబిరం

రుద్రూరు, జూన్ 15 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యజ్ఞ సహిత యోగ కేంద్రం ఆధ్వర్యంలో రుద్రూరు మండల కేంద్రంలో ఐదు రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, రుద్రూరు మండల పతంజలి అధ్యక్షుడు కె.వి.మోహన్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలోని పతంజలి యజ్ఞ సహిత యోగ కేంద్రంలో ఈనెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉదయం 5.30 గంటల నుంచి 6.45 వరకు యోగా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. యోగా శిక్షణ శిబిరంలో యోగ, ప్రకృతి బద్ధంగా జీవితంలో జీవన విధాన శైలిని పెంపొందించుకోవడానికి యోగాసనాలు, సూర్య నమస్కారాలు, సూక్ష్మ, స్థూల వ్యాయామాలు, యోగిక్ జాగింగ్, ప్రాణాయామం, ధ్యానం, ఆయుర్వేదం, ఆక్యుప్రెషర్, ముద్ర విజ్ఞానం నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9491739436, 9949489697 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి

బోధన్‌రూరల్,జూన్15: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ, బదిలీ తప్పనిసరి అని మండల విద్యాశాఖ అధికారులు అన్నారు. బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సుజాతకు మండల విద్యాశాఖ అధికారులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ, బదిలీలు ఉద్యోగంలో భాగమన్నారు.

రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలి

నవీపేట,జూన్15: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నవీపేట ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ శ్యామ్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షకాలం సీజన్ ప్రారంభమైనందున అర్హులైన రైతులందరికీ పంట రుణాలను అందించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, కిషన్ తదితరులున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రెంజల్,జూన్15: మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో 50ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసిన తహసీల్దార్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో ఐదుగురు మంది సభ్యులు పాల్గొనగా కందకుర్తి గ్రామానికి చెందిన ఈర్షన్ బేగ్ 61,500 రూపాయలకు వేలంలో కొనుగోలు చేశారు. వేలంలో కొనుగోలు చేసిన ఇసుకను తరలించాలని వేలం నిర్వాహకుడు ఈర్షన్ తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రెంజల్,జూన్15: బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం సాటాపూర్ మార్కెట్‌లో పశువుల క్రయవిక్రయాలు జోరుగా సాగడంతో ఎస్ఐ సాయన్న మార్కెట్‌లో పశువుల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పశువైద్య అధికారి పర్యవేక్షణలో క్రయవిక్రయాలు జరుపాలని లేనియెడల శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి పశువులను తరలించరాదన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలించిన డీఎల్‌పీవో

రుద్రూరు, జూన్ 15 :రుద్రూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే కొనసాగుతుంది. ఈ సర్వేలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అక్బర్‌నగర్, అంబం గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వేను డీఎల్‌పీవో సాయిబాబా పరిశీలించారు. లబ్దిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు భగీరథ నీరు వస్తుందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 శాతం సర్వే పూర్తయిందని ఎంపీవో సాయిలు వివరించారు. ఈ కార్యక్రమాలలో కార్యదర్శులు గంగారాం, శ్రవణ్ పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

రుద్రూరు, జూన్ 15 : రుద్రూరు మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా శనివారం కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డి.రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దోమలు, వాటి ద్వారా వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా, మెదడు వాపు వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. నీటి నిల్వలను, కుండీలలో, డ్రమ్ములలో, కొబ్బరి బొండాలలో, టైర్లు, ప్లాస్టిక్ కప్‌లలో నిల్వ నీటిని పారబోయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రవి, సుమతి, ఆరోగ్య కార్యకర్తలు గౌరి, ప్రమీల, గిరీష్, ఆశా కార్యకర్తలు పుష్ప, ప్రమీల, ఇందిరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ

రుద్రూరు, జూన్ 15 :రుద్రూరు మండల కేంద్రంలోని జెడ్‌పీహెచ్‌ఎస్, ఉర్దూమీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బాపూర్(ఎం)లో దొంగతనం

నవీపేట, జూన్15: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన కాడం కళావతి అనే మహిళ తన ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన కుమారుడి ఇంట్లో నిద్రించిందని అన్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపల ఉన్న తులం బంగారు గొలుసు, అర తులం బంగారం ఉంగరం ఎత్తుకెళ్లారని కళావతి కుమారుడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగరంలో పేకాట రాయుళ్ల అరెస్టు

ఖిల్లా, జూన్ 15: నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఇంద్రాపూర్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10,600 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు తమ సిబ్బందితో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిల్ కలెక్టర్‌లు, వార్డు ఆఫీసర్‌లకు సన్మానం

ఆర్మూర్‌టౌన్ , జూన్15: మున్సిపల్ కార్యాలయంలోని పని చేసే బిల్‌కలెక్టర్‌లకు, వార్డు ఆఫీసర్‌లకు శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజు ఘనంగా సన్మానించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఏప్రిల్ మాసంలో పన్ను వసూలులో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా బిల్‌కలెక్టర్‌లను, వార్డు ఆఫీసర్‌లను పట్టుశాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రజాపాలన దరఖాస్తులు

ఆర్మూర్‌టౌన్ జూన్15: ఈనెల 18 నుంచి ప్రజాపాలన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య తెలిపారు. ఇప్పటి వరకు జీరో కరెంటు బిల్లు, సబ్సిడీపై గ్యాస్ పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

తైబజార్ వేలం పాట వాయిదా

ఆర్మూర్‌టౌన్ , జూన్15: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తైబజార్ వేలం పాట వాయిదా పడిందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వేలం పాటలో ముగ్గురు పాల్గొనగా కనీస ధర రాకపోవడంతో వాయిదా వేశామని, ఈనెల 21న మళ్ళీ వేలం పాట ఉంటుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, వైస్‌ఛైర్మన్ మున్ను, తదితరులు పాల్గొన్నారు.

బీర్‌బాటిల్‌తో యువకుడిపై దాడి

ఆర్మూర్‌టౌన్, జూన్15: ఆర్మూర్ పట్టణ శివారులో బీహర్‌కు చెందిన సోన్‌కుమార్ అనే యువకునిపై గుర్తుతెలియని వ్యక్తులు బీర్ బాటిల్‌తో దాడి చేసినట్టు తెలిసింది. పట్టణ శివారులోని గుట్ట ప్రాంతంలో బీర్‌బాటిల్‌తో గొంతు వద్ద గాయాలు కాగా సోన్‌కుమార్ నడుచుకుంటూ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

లయన్స్ అధ్యక్షుడిగా గాలయ్య ఎన్నిక

బీర్కూర్, జూన్ 15 : బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో శనివారం లయన్స్ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశంలో నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గాలయ్యను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రవీందర్ జెట్లి, కోశాధికారిగా సీతాలే రమేష్, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గాలయ్యకు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్, జూన్15: బక్రీద్‌తో పాటు రాబోయే పండుగలను ప్రజలందరూ కలిసిమెలసి ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరు కలిసిమెలసి కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో బక్రీద్‌పండుగ సందర్భంగా పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. అనంతరం మత పెద్దలు మాట్లాడారు.

సమయపాలన పాటించాలి : జిల్లా వైద్యాధికారి



ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

పెద్దబజార్, జూన్ 15: టీహబ్, సఖీ సెంటర్లను శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్, పాలియెటివ్ కేర్‌సెంటర్, సఖీ సెంటర్, అనాథల ఆశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో డెంగ్యూ పరీక్ష ఎన్ఎస్-1 స్ట్రిప్స్ 223 అందుబాటులో ఉన్నాయని అన్నారు. మిగతా పరీక్షలకు సంబంధించి ఎన్ని కెమి కల్స్ స్టాక్ ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సరిపడా లాజిస్టిక్స్ కోసం ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. 24 గంటల్లోగా రిపోర్టులు పేషెంట్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని, ల్యాబ్ టెక్నీషియన్‌లకు సూచించారు.

ట్యాలీవ్ కేర్ కేంద్రాన్ని సందర్శించగా.. అక్కడ డాక్టర్ చైతన్యకుమార్ అందుబాటులో లేనందున అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్లు, కొత్తగా రోగులు ఎవరు రానందున క్షేత్రస్థాయి నుంచి ఇన్‌పేషెంట్లు వచ్చేలాగా చూడాలని సమయపాలన పాటించాలని హెచ్చరించారు. సఖి సెంటర్లలో సిబ్బంది ప్రతిరోజు సమయానికి వచ్చి సమయ పాలన పాటించాలని అక్కడి సిబ్బందికి తెలిపారు. అనాధల ఓపెన్ సెంటర్‌లో ఉండే వారికి తగిన సమయంలో వైద్య సౌకర్యాలు అందిస్తు చికిత్సను సమయానికి ఇవ్వాలని ఆరోగ్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఆరోపణలు రుజువు చేస్తే తప్పుకుంటాం



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే పీఏలు వికాస్, సిద్దు

- 48 గంటల్లో రుజువు చేయాలి
- ఆధారాలు నిరూపించకపోతే పరువు నష్టం దావా వేస్తాం

ఎల్లారెడ్డి, జూన్ 15 : మేము ఎక్కడైనా డబ్బులు వసూలు చేసినట్లు గాని, ఎవరికైనా బెదిరించినట్లు గాని నిరూపిస్తే తమ పదవుల నుంచి తప్పుకుంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు వ్యక్తిగత సహాయకులు వికాస్, సిద్దు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వీకేపీ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిపై వచ్చిన ఆరోపణలపై మాట్లాడుతూ ఏమైనా ఆధారాలు ఉంటే 48 గంటలలో ఆధారాలు నిరూపించాలని లేనిచో పరువు నష్టం దావా వేస్తామన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దగ్గర గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేస్తూ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, మా ఎదుగుదలను ఓర్వలేక, ఎమ్మెల్యేకు గాని మాకు చెడ్డ పేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తే దానికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, సుజిత్, విద్యాసాగర్, చెన్న లక్ష్మణ్, జడ్పీటీసీ ఉషాగౌడ్, అజార్ ఖాద్రి, ఆరీప్, నాగం గోపి కృష్ణ, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు పేరిట రాజకీయం తగదు'



లింగంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లింగంపేట, జూన్ 15 : పొల్కంపేటలో ఎన్‌డీసీసీబీ బ్యాంక్ అధికారులు రైతు పొలంలో ఫ్లెక్సీ పాతితే దానిని ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ పార్టీకి బురద అంటించి రాజకీయం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం లింగంపేట కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్ బ్యాంక్ ఎదుట ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. గత 10సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రైతులకు రిబెట్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండగా రైతులకు రిబెట్ ఇచ్చిందని ఆయన తెలిపారు. గత 10సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎందుకు రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. నిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం మానుకోవాలని వారు సూచించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లమయ్య, ఫతియోద్దీన్, అట్టెం శ్రీను, ప్రసాద్‌గౌడ్, జక్సాని రవి, నయీం, భైరయ్య, సాయికుమార్, గంగారెడ్డి, రఫీఖ్ నాయకులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కొనసాగుతున్న వైద్య శిబిరం

బోధన్‌రూరల్,జూన్15: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే డాన్ టు డాస్క్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, వనిత ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని కన్యాకా పరమేశ్వరి ఆలయంలో మొక్కులు నాటారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కొత్త రవీందర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహాజన్‌రాజీ, 103జిల్లా గవర్నర్ జాడే సుదర్శన్ గుప్తా, రీజినల్ ఛైర్‌పర్సన్ సతీష్, జోన్ ఛైర్మన్ రాజు, వాసవి క్లబ్ బోధన్ కార్యదర్శి డాక్టర్ సూర్యరావు, డాక్టర్ సురేష్, వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు శాంతిశ్రీ, సెక్రెటరీ అంజలి జాంకార్, కోశాధికారి రాజశ్రీ, కంటాల రమేష్ పాల్గొన్నారు.

వ్యాపారులకు వసతులు కల్పించండి

● ఏసీపీకి ఎంఐఎం నేతల వినతి



ఏసీపీకి వివరాలు తెలుపుతున్న ఎంఐఎం నేతలు

ఖిల్లా, జూన్ 15: బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రాత్రివేళ వ్యాపారాలు చేసుకునే అవకాశాలు వ్యాపారులకు కల్పించాలని ఎంఐఎం నేతలు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవించారు. శనివారం ఆయన ఛాంబర్‌లో కలిసి బక్రీద్ పండుగ ఉన్నందున నగరం నుంచి బోధన్‌వైపుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను మళ్లించాలని కోరారు. స్పందించిన ఏసీపీ పండుగను శాంతియుతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రజల కోసమే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని తెలిపినట్లు ఎంఐఎం ప్రతినిధులు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్‌హామద్ ఫాజిల్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కార్పోరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంఐఎం నాయకులు మునవర్‌అలీ, షహబాస్, తదితరులున్నారు.

'ఉపాధ్యాయుల పదోన్నతిలో న్యాయం చేయాలి'



కోటగిరిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కోటగిరి,జూన్15: ఉపాధ్యాయుల పదోన్నతిలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరిని సీనియారిటి ప్రకారం పదోన్నతి కల్పించాలని ఉమ్మడి పీఆర్‌టీయూ మండలాల నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ పండిట్, పీఈటీ అప్‌గ్రేటేషన్ కామన్ సీనియారిటీ ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులలో బీఈడీ అర్హత గల ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు జీవో 12 ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. 25సంవత్సరాల సర్వీసు ఉండి హెచ్‌ఎం బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ పదోన్నతి విషయంలో కేవలం బీఈడీ వారినే పరిగణలోకి తీసుకోవడం అన్యాయం అన్నారు. ఎస్‌జీటీ టీచర్లకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వెంకటేష్, గంగారాజు, సాయిలున్నారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ రాజేందర్

రుద్రూరు, జూన్ 15 : రుద్రూరు మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా శనివారం కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డి.రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దోమలు, వాటి ద్వారా వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గూన్యా, మెదడు వాపు వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. నీటి నిల్వలను, కుండీలలో, డ్రమ్ములలో, కొబ్బరి బొండాలలో, టైర్లు, ప్లాస్టిక్ కప్‌లలో నిల్వ నీటిని పారబోయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రవి, సుమతి, ఆరోగ్య కార్యకర్తలు గౌరి, ప్రమీల, గిరీష్, ఆశా కార్యకర్తలు పుష్ప, ప్రమీల, ఇందిరలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు.. పరిశీలన అంశంపై చర్చాగోష్టి



సమావేశంలో మాట్లాడుతున్న రాజకీయ విశ్లేషకులు అబ్బాస్

పెద్దబజార్, జూన్ 15: బీజేపీ నియంతృత్వ, మతోన్మాద పోకడలను, మోదీ అహంకారాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విలువలకు పట్టం కట్టారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎండీ అబ్బాస్ అన్నారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికలు-పరిశీలన అంశంపై శనివారం ట్రస్ట్‌భవనంలో చర్చాగోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బీజేపీకి 240 సీట్లు మాత్రమే ఇచ్చి ప్రజలు ముక్కుతాడు వేశారని అన్నారు. ప్రజల దైనందిన జీవిత సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలం చెందిన బీజేపీ, మత విద్వేషాలు రెచ్చగొట్టి మరోసారి విజయం సాధించాలని చూసిందని, దీనిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. విభిన్న సంస్కృతుల నిలయమైన దేశాన్ని ఏక సంస్కృతిలోకి కుదించాలనే బీజేపీ ప్రయత్నాన్ని ప్రజలు ప్రతిఘటించారని, వైవిధ్యమే మన దేశ బలమని, దానినే ప్రజలు కాపాడుకోవడం కోసం కృషి చేశారని అన్నారు. ఈ సమావేశంలో హుస్సేన్, నారాయణ, చంద్రశేఖర్, రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ కేంద్రానికి ప్రచార వాహనం అందజేత



నగరంలో ప్రచార రథాన్ని అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 15: నగరంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్రీకృష్ణుని భక్తితత్వాన్ని బోధిస్తూ ప్రజలను ధర్మంవైపు నడిపించే విధంగా విశేష కృషిని నిర్వహిస్తున్న ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రానికి ఇందూరు నగరం మహేశ్వరి సేవా సమాజ్ ధర్మప్రచార రథాన్ని బహుమతిగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ కేంద్ర నిర్వహకుడు రామానంద ప్రభు, మహేశ్వరి సమాజ్ ప్రతినిధులు రామ్‌స్వరూప్ డాలియా, కమల్ కిశోర్, పవన్ కేడియా, బాలకృష్ణ ఇనాని, గిరిదారి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్‌కదం, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ కరపత్రాల విడుదల

కామారెడ్డిరూరల్,జూన్15:జూన్ 23న హైదరాబాద్‌లో జరిగే స్వదేశీ జాగరణ, స్వాబలంబి భారత అభియాస్ తెలంగాణ ప్రాంత సభ కరపత్రాలను శనివారం ఆర్కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కామారెడ్డి జిల్లా కార్యవాహ పట్లోళ్ల సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ జూన్ 23న తేదీన కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాద్ యందు స్వదేశీ జాగ రణ మంచ్ స్వాలంబి భారత అభియాన్ ఆధ్వర్యంలో ప్రాంత సభ నిర్వహిస్తున్నారని మంత్రులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు హజరవుతారని తెలిపారు.

కార్యక్ర మంలో స్వదేశీ జాగరణ మంచ్ కార్యకర్తలు బొర్రా రాజగౌడ్, గోవర్ధన్ రెడ్డి,డా. యాలాద్రి, డా.రాహుల్ కుమార్, సంతోష్‌గౌడ్, జంగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల తనిఖీలు



ప్రైవేట్ పాఠశాల బస్సు ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి,జూన్ 15: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను శనివారం ఉదయం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి తనిఖీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు నడిపే వాహనాలు ఫిట్‌నెస్, పర్మిట్, టాక్స్ అలాగే వాహనాలు నడిపే డ్రైవర్లకు లైసెన్స్‌తో పాటు బస్సుకు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తనిఖీ చేశారు. ప్రతీ బస్సుకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని ఫిట్‌నెస్ లేనిచో సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్ పీహెచ్‌సీలో ఆశాలు, ఏఎన్ఎంలకు శిక్షణ


బీర్కూర్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సీహెచ్‌వో రవీందర్

బీర్కూర్,జూన్ 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉమ్మడి మండలాల ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు జాతీయ నులి పురుగుల వ్యాధి నిర్మూలన దినోత్సవం, టీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈనెల 20న జాతీయ నులి పురుగుల వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మండలాల్లోని 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించనున్నట్లు సీహెచ్‌వో రవీందర్ తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో,కళాశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధి నివారణ కోసం 18 సంవత్సరాలు పైబడిన వారికి అడల్ట్ టీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా బీసీజీ వ్యాక్సిన్ ఇంజక్షన్లు ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్ నెలలో ఇవ్వనున్నట్లు తెలిపారు.ఆరోగ్య, ఆశా,అంగన్‌వాడీ సిబ్బంది కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు గిరీష్, సూపర్‌వైజర్లు,ఏఎన్ఎంలు,ఆశాఅంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి మృతితో అనాథలైన చిన్నారులు

తాడ్వాయి,జూన్ 15:మండల చందాపూర్ గ్రామంలో తండ్రి మృతిచెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.గత కొన్నినెలల క్రితం తల్లిమృతి చెందింది తండ్రి ఆవుల రాజేందర్ సైతం మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు శ్రీరుద్ర,శ్రీకర్లు అనాథాలుగా మారారు.బ్రతుకుదెరువుకోసం రాజేందర్ కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లిలో నివాసముంటున్నారు. కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజేందర్ గత కొన్నిరోజులుగా ఫిట్స్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఫిట్స్‌కారణంగా కొద్దిరోజుల క్రితం కిందపడిపోయాడు. దీంతో ఆయనకు పలు ఆసుపత్రులలో చూపించిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు చందాలు వేసుకుని రాజేందర్ అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందించారు.

నూతన నేరచట్టాలపై అవగాహన



నూతన నేరచట్టాలపై అవగాహన చేపడుతున్న దృశ్యం

కామారెడ్డిటౌన్,జూన్ 15: 2024 జూలై నుంచి అమలుకానున్న నూతన భారతీయ చట్టాలపై న్యాయసలహాలను శనివారం జిల్లా ఎస్పీకార్యాలయంలో పీపీలు, పోలీసులకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనరసయ్య అందించారు. భారతీయ సన్నిహిత,భారతీయ నాగరిక్ సురక్ష సన్నిహిత, భార తీయసాక్ష్య అధినయం-2023,ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యా క్ట్‌లో కీలకమార్పులు, ఇకపై ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌కు అధిక ప్రాముఖ్యత, ప్రతీ ఒక్క పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహరెడ్డి, అడిషనల్ పీపీలు రాజేష్‌గౌడ్, అశోక్‌శివరాం, నందరమేష్, నిమ్మదామోదర్ రెడ్డి, రాజేశ్వరి,సత్యనారాయణ,శేషు,డీఎస్పీ నాగేశ్వరరావు, మదన్‌లాల్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాజులకుంటను జాయింట్ సర్వే నిర్వహించాలి

ఎల్లారెడ్డి, జూన్ 15: ఎల్లారెడ్డి మండల పరిధిలోని కబ్జాకు గురైన రాజులకుంట, నాగన్న కుంటలను రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు ఆయకట్టుకు సంబంధించిన రైతులు శనివారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం కుంటలకు సంబంధించిన దాని ప్రతులను తహసీల్దార్ మహేందర్‌కు, ఇరిగేషన్ శాఖ, ఇతర అధికారులకు అందించారు.

రాష్ట్ర సహకార సంఘ చట్టం ప్రకారమే

రైతు భూమిలో ఫ్లెక్సీ ఏర్పాటు

- మార్టిగేజ్ లోన్ మాఫీ కాదు
- క్రాప్ లోన్ రైతులను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు
- రైతు రాజశేఖర్‌రెడ్డి ఈనెల 19వ తేదీలోపు 50 శాతం రుణం కట్టకపోతే భూమి వేలం వేస్తాం
- ఎన్‌డీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ సూర్యప్రకాష్


లింగంపేటలో మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ జనరల్ మేనేజర్

లింగంపేట, జూన్ 15 : రాష్ట్ర సహకార సంఘ చట్టం 1964 ప్రకారమే పొల్కంపేట గ్రామానికి చెందిన రైతు బండారు రాజశేఖర్‌రెడ్డి భూమిలో వేలం వేస్తామని ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని ఎన్‌డీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం ఆయన కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని ఎన్‌డీసీసీ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు రాజశేఖర్‌రెడ్డి 2010లో ట్రాక్టర్ కొనుగోలు కోసం తన భూమిని మార్టిగేజ్ చేసి బ్యాంక్‌లో అప్పు తీసుకున్నాడన్నారు. కాల పరిమితి ముగిసినప్పటికీ అప్పు చెల్లించకపోవడంతో అనేకమార్లు రైతుకు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదన్నారు.దీంతో గత గురువారం రైతు భూమిని ఈనెల 20న విక్రయిస్తున్నామని చట్టప్రకారమే ఫ్లెక్సీ ఏర్పాటు చేశామన్నారు. సదరు రైతు ఈనెల 19వ తేదీ లోపు 50శాతం అప్పు చెల్లించకపోతే ఈనెల 20న భూమిని వేలం వేస్తామన్నారు. బ్యాంకులో మార్టిగేజ్ చేసి రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తించద న్నారు. క్రాప్‌లోన్ తీసుకున్న రైతులను ఎవరినీ అప్పు కట్టాలని తాము ఒత్తిడి చేయలేదన్నారు. మార్టిగేజ్ రుణాలు తీసుకున్న రైతులు ఈనెల 30లోపు ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా పూర్తి రుణాలు చెల్లించాలని కోరారు. రైతులు అనవసరమైన అపోహలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇప్పటికే ఉమ్మడినిజామాబాద్ జిల్లాలోఎన్‌పీఏ(నాన్‌ఫర్మారింగ్‌అసెట్స్) కింద రూ.230 కోట్లు దీర్ఘకాలిక రుణాలు బాకీ ఉండగా..సంవత్సరకాలంగా రూ.100 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. ఎన్‌పీఏ తగ్గించాలని రిజర్వు బ్యాంక్ నుంచి ఒత్తిడి పెరిగిందన్నారు. లింగంపేట బ్యాంక్‌లోనే అత్యధికంగా ఉందని, ఎన్‌పీఏ కారణంగా అసలైన రైతులకు క్రాప్ లోన్స్ సైతం ఇవ్వలేకపో తున్నామని జనరల్ మేనేజర్ సూర్య ప్రకాశ్ తెలిపారు.ఓటీఎస్ ద్వారా ఇప్పటికే జిల్లాలో బ్యాంక్ రూ.20కోట్ల నష్టాన్ని భరిస్తుందని తెలిపారు. దీర్ఘకాలిక రుణాలు మాఫీ కావని.. రైతులు ఎంత త్వరగా ఓటీఎస్ చేసుకుంటే అంత మంచిదని ఆయన సూచించారు.ఈసమావేశంలో ఎన్‌డీసీసీ బ్యాంక్ డిప్యూటీజనరల్ మేనే జర్ శ్రీనివాస్,రికవరీ మేనేజర్ భూపాల్‌రెడ్డి,ఏజీఎంలునాగరాజు, యాద గిరి, లింగంపేట బ్యాంక్‌మేనేజర్ కుమారస్వామితో పాటు సిబ్బంది ఉన్నారు.

నగల కోసమే వృద్ధురాలి హత్య : సీఐ కృష్ణ


సమావేశంలో నిందితుడిని చూపిస్తున్న సీఐ కృష్ణ

బాన్సువాడ,జూన్ 15: నగల కోసమే వృద్ధురాలిని యువకుడు హత్య చేశాడని పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణ మాట్లాడుతూ తాడ్కోల్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న ఉప్పరి సాయవ్వను కింది పోర్షన్‌లో ఉంటున్న యువకుడు తొడిమెల సాయిబాబా ఈనెల 12న ఉదయం గొంతు కోసి హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవి కమ్మలు, వెండి కడియాల ను ఎత్తుకెళ్లాడని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు అల వాటుపడి రూ. 16 లక్షలు అప్పులు చేశాడు. ఒంటరిగా ఉన్న సాయ వ్వను ఎలాగైనా హత్య చేసి ఆభరణాలు ఎత్తుకెళ్లాలని పథకం వేసి ఈనెల 11న రాత్రి 12 గంటల సమయంలో సాయవ్వకు ఫోన్ చేసి ఇంట్లో వాళ్ల తలుపులు తీయడం లేదని, మీ ఇంట్లో పడుకుంటానని నమ్మించాడు. ఉదయం 4 గంటలకు లేచి గాఢ నిద్రలో ఉన్న సాయ వ్వను ముందే తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. చెవి కమ్మలను ప్రైవేట్ ఫైనాన్స్‌లో కొదువ పెట్టి రూ. 45 వేలు అప్పు తీసుకుని కొంత అప్పు తీర్చి మిగతా డబ్బులతో ఆన్‌లైన్ గేమ్ ఆడాడు. సాయవ్వ ఫోన్ డేటా ఆధారంగా సాయిబాబాపై కన్నేసిన పోలీసులు శుక్రవారం బంగారు గుండ్లను కొదువ పెట్టడానికి వెళుతున్న సమయంలో పోలీసులు తాడ్కోడల్ చౌరస్తాలో పట్టుకున్నారు. అనంతరం విచారించగా నగల కోసమే హత్య చేశానని నిందితుడు ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ఈ హత్య కేసును చేధించిన కానిస్టేబుల్‌ను సీఐ అభినందించారు.

ఫార్చునర్ వాహనం ఢీకొని ఇద్దరు మృతి


ప్రమాదం జరిగిన స్థలంలో కాలిపోతున్న ఎక్సెల్ వాహనం

పెద్ద కొడప్‌గల్, జూన్ 15: మండలంలోని బేగంపూర్ చౌరస్తాలో శనివారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన ఒకటి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.... బిచ్కుంద మండలం శాంతాపూర్ గ్రామానికి చెందిన శివరాం(52) బేల్దారి పని చేస్తుంటాడు. ఇతను ఇదే మండలంలోని మాన్యాపూర్ గ్రామానికి చెందిన యాదుల్ తో కలిసి పిట్లంలో ఓ ఇంటి కూన కప్పే పనుల నిమిత్తం వచ్చి పని మాట్లాడుకుని పిట్లం నుండి శాంతాపూర్ తిరుగు పయనమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం బేగంపూర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే హైదరాబాద్ నుంచి బెంగుళూర్ వెళ్తున్న పార్చునర్ వాహనం టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అంతేగాక పార్చునర్ వాహనం ఎక్సెల్‌ను బలంగా ఢీకొట్టడంతో ఎక్సెల్ వాహనం అగ్నికి ఆహుతి అయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే ఫార్చునర్ వాహనంలో ప్రయాణిస్తున్న వారు అక్కడి నుండి పరారయ్యారు. ప్రమాద విషయం తెలియగానే పోలీసులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పక్కకు తీశారు. పార్చునర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడం వలననే ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న వారు బలమైన దెబ్బలు తగిలి మృతి చెందారని స్థానికులు తెలిపారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ కోనా రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి,జూన్ 15:ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎర్రమన్ను కుచ్చ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు వార్డు కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్, వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణితో కలిసి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠ శాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

సదాశివనగర్:మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 వతరగతి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యా దవ్ శనివారం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం,మధ్యాహ్న భోజనం క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విశాలమైన తరగతి గదులు ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులకు,విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ రజిత మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీచేస్తున్న ఉచిత పుస్తకాలను సద్వినియోగంచేసు కోవా లని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులను చేర్పించి నాణ్యమైన విద్యను తమ పిల్లలకు అందేలా తల్లి దండ్రులు చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ఛైర్మన్ నాగలక్ష్మీ, హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణ మహోత్సవం


టీటీడీలో శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, జూన్ 15 : తెలంగాణ తిరు మల దేవస్థానంలో శనివారం శ్రీవారి కల్యా ణ మహోత్సవం వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కొత్తూరు వెంకట రమణ, లక్ష్మీస్వరూప, శాంతిసాగర్,భవానీదేవి, శ్రీనివాస భాను ప్రకాష్, హేమలత దంప తులు స్వామి వారి కల్యాణ మహోత్స వాన్ని తమ సొంత ఖర్చులతో జరిపించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు నందు పంతులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. బీర్కూర్‌కు చెందిన కొట్టూరి సంతోష్‌కుమార్ అనే భక్తుడు శాశ్వత అన్నదాన కార్యక్రమం కోసం రూ.25 వేల విరాళంగా అందజేశారు.

18న జగద్గురు రాక

మద్నూర్,జూన్ 15: జుక్కల్ మండలంలోని తెలంగాణ ఉప పీఠానికి జగద్గురు నరేంద్రచార్య మహరాజ్ ఈనెల 18, 19న రెండు రోజుల పాటు ఉప పీఠానికి వచ్చి భక్తులకు సమస్య పరిష్కారం, మార్గ దర్శనం చేస్తారని, భక్తులు రావాలని సంస్థానం నిర్వాహకులు కోరారు.ఈసందర్భంగా భక్తు లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను గోడ పత్రాలను అందజేస్తున్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి పథకం వర్తింపచేయాలి


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెద్ద కొడప్‌గల్, జూన్ 15: మండలంలో గల అర్హులైనవారందరికి గృహజ్యోతి పథకం అమలు చేయాలని కోరుతూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతు గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జుక్కల్ మండలంలో అధికారుల నిర్లక్ష్యం వలన 3 వందల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాలేదని, దీంతో వారందరూ గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్‌తో పాటు రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేల నష్టపోతున్నారని తెలిపారు.గృహజ్యోతి పథకంకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో అర్హులకు ప్రయోజనం అందడం లేదని విమర్శించారు.ఇప్పటికైనా విద్యుత్ అధికారులు గృహజ్యోతి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లేదంటే విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎంపార్టీ జిల్లా కమిటీ సభ్యులుఅజయ్,సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగను జరుపుకోవాలి

- బాన్సువాడ ఎస్‌హెచ్‌వో కృష్ణ


పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌వో కృష్ణ

కామారెడ్డిటౌన్,జూన్ 15: బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివా రం కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ నాగేశ్వర్‌రావు శాంతి సమావేశాన్ని నిర్వహించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరు పుకోవాలని ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటుచేయడం జరుగుతుందని అదేవిధంగా మున్సిపాలిటీ నుంచి శానిటేషన్ సక్రమంగా జరిగే విధంగా చూడడం జరుగుతుందని తెలి పారు. ఏవ్యక్తి కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, ఏదైనా సమా చారాన్ని తప్పనిసరిగా పోలీసువారికి తెలియజేయాలని తెలిపారు.

బాన్సువాడటౌన్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాన్సువాడ ఎస్‌హెచ్‌వో కృష్ణ ప్రజలను కోరారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో అన్ని పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలసి ఉండాలని , పండగలను కలిసి జరుపుకోవాలన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బాన్సువాడలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉంటారని, ఇప్పటి వరకు ఎలాంటి సంఘటనలు జరగలేవన్నారు.ఈద్గా, మజీద్, కబేళాల వద్ద పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. స్పందించిన మున్సిపల్ అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జుబేర్ , మున్సిపాలిటీ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్, లింగం, వాహబ్, కాంగ్రెస్ నాయకులు ఖాలేక్, మన్నన్, షాదాబ్, బీజేపీ నాయకులు సాయికిరన్ తదితరులున్నారు.

రామారెడ్డి: బక్రిద్ పండుగ సందర్భంగా గోవధ చేయరాదని రామారెడ్డి ఏఎస్ఐ రవీందర్‌పేర్కొన్నారు. రామారెడ్డిమండల కేంద్రంలో శనివారం పోలీసుస్టేషన్ వద్ద పీస్ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామమాజీ సర్పంచ్ సంజీవ్, ఏఎస్ఐ సుభాషిణి, హెడ్‌కానిస్టేబుల్ రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గడికోటలో సామూహిక అక్షరాభ్యాసం


దోమకొండ గడికోటలో అక్షరభ్యాసం నిర్వహిస్తున్న సుధాజీజార్య

దోమకొండ, జూన్ 15:మండల కేంద్రంలోని గడికోటలోని ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ అపోలో సీఎస్ఆర్ హెడ్ సుధాజీజార్య, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ హాజరయ్యారు. కోటలోని ఆలయంలో బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య సరస్వతి పూజ నిర్వహించారు.అనంతరం 200 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.కార్యక్రమంలో గడికోట ట్రస్ట్ సీనియర్ మేనేజర్ బాబ్జీ, సీడీపీవో రోచిష్మా,సూపర్ వైజర్లు నిర్మలా,మంగ, అంగన్‌వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంధ సేవా సంస్థ సొసైటీ అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, జూన్ 15: మండలం నెమ్లి గ్రామంలో శనివారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం బాన్సువాడ స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ (ఎస్ఎస్‌టీ) ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు ఏవిధంగా చేసుకోవాలి బ్యాంకులపైన అవగాహన, సైబర్ నేరాలపై అవగాహన జాగ్రత్తలు, ఏటీఎం వాడకం వల్ల ఉపయోగాలు, డిజిటల్ పేమెంట్స్, బీమా పథకాలపైన అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్, కౌన్సిలర్ బాలకృష్ణ, పర్వయ్య, గ్రామస్తులు,మహిళలు, యువకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడిపోతున్నారు.. స్పందించండి!


గుంతలో పడిన వ్యక్తిని అటుగా వెళ్లే వారు బయటకు తీసిన దృశ్యం

దోమకొండ,జూన్ 15: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గుంత, అందులో రాయి ఉండటంతో రాత్రి సమయంలో అటుగా వెళ్లే వాహనాదారులు అందులో పడిగాయాల పాలవుతున్నారు.రాత్రి సమయంలో బురుజు, పనుగట్ల, బీబీపేట రోడ్డు నుంచి పనుగట్ల వైపు వచ్చే వాహనాదారులు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న గుంత వద్ద పచ్చని గడ్డి ఉండటంతో అది గమనించని వాహనాదారులు బైక్‌తో పాటు అందులో పడిపోతుండటంతో గాయాలయ్యాయి.వారం రోజుల్లోనే ఇద్దరు వ్యక్తులు బైక్‌లతో పాటు వ్యక్తులు గుంతలో పడిపోవడంతో అటుగా వెళ్లే వ్యక్తులు, స్థానికులు వారిని గమనించి వెంటనే బైక్‌తో పాటు వ్యక్తిని బయటకు తీసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంబంధితశాఖ అధికారులు స్పందించి అక్కడ ఉన్నగుంతను పూడ్చి వేయాలని పలువురు కొరుతున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	మహారాజ
శాంతి	ఓసీ
ప్రియా 70	మనమే
ప్రియా 35	హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి	ఇంద్రాణి
వెంకటేశ్వర	మహారాజ

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	240

